నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 4 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

నేడు బీసీ కమిషన్ రాక

- స్థానిక సంస్థల రిజర్వేషన్ల దామాషాపై బహిరంగ విచారణ
- ఉమ్మడి జిల్లాలోని వివిధ వర్గాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నీలగిరి, నవంబర్ 3 : స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై బీసీ కమిషన్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్ అధ్యక్షతన రాపోలు జయప్రకాశ్, తిర్మలగిరి సురేందర్, బాలలక్ష్మి బృందం ఉదయం 9.30 నిమిషాలకు జిల్లా కేంద్రానికి చేరుకుని సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదిత్యభవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించిన సామాజిక వర్గాల ప్రజాప్రతినిధులు, ఆసక్తి ఉన్న వారి నుంచి స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై రాతపూర్వకంగా ప్రజాభిప్రాయాన్ని స్వీకరించనున్నట్లు అమె స్పష్టం చేశారు. సాయంత్రం 4.30 నిమిషాలకు అక్కడే ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

రుణమాఫీ ఇంకెప్పుడో..?

మూడు విడుతల్లో మాఫీ అరకొరే..

69,292 మంది రైతులకు మాత్రమే డబ్బులు
ఇంకా వేలాది మంది కర్షకులకు శూన్య హస్తమే
గ్రీవెన్స్ సెల్‌కే 4200 మంది దరఖాస్తులు
ఇక రెండు లక్షలకుపైగా రుణాల మాఫీ ఊసే లేదు..
పైన డబ్బులు మిత్తీలకు అప్పులు తెచ్చి కట్టిన రైతులు
మాఫీ దేవుడెరుగు.. రోజు రోజుకూ పెరుగుతున్న వడ్డీలు
సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాత

రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటున్న రుణ మాఫీ అసంపూర్ణంగానే మిగిలిపోయింది. అనేక కొర్రీలతో వేలాది మంది మాఫీకి దూరం కాగా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. రూ. రెండు లక్షల లోపు రానివారే వేలల్లో ఉండగా, రూ. రెండు లక్షల పైగా ఉన్నోళ్లు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. అగో ఇస్తాం.. ఇగో ఇస్తాం.. అనే ప్రకటనతోనే పాలకులు కాలం వెల్లదీస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి నవంబర్ 3 (నమస్తే తెలంగాణ)

గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మాఫీ ఒకేసారి చేస్తామని గతంలో కాంగ్రెస్ ప్రకటించినా.. విడుతల వారీగా అమలు చేస్తున్నది. జూలై 18 నుంచి రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు దఫాలు కలిపి 69, 292 మంది రైతులకు రూ. 557 కోట్ల రుణ మాఫీ జరిగినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న 36,483 మంది రైతులకు రూ.199. 46 కోట్లు, లక్ష నుంచి లక్షన్నర వరకు తీసుకున్న 19,798 మంది రైతులకు రూ.193. 96 కోట్లు, లక్షన్నర నుంచి రెండు లక్షల మధ్య రుణాలకు 13,011 మంది రైతులకు రూ.164. 66 కోట్ల రుణాలు మాఫీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం చెప్తున్న లెక్కలకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి చాలా తేడా ఉంటున్నది. ఇంకా వేలాది మందికి రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు లక్షల పైన కట్టినోళ్ల సంగతేంది..?

మూడు విడుతల్లో రుణమాఫీ రాని వాళ్ల పరిస్థితి ఇలా ఉంటే.. రెండు లక్షలకు పైగా రుణాల ఉన్న కర్షకులది మరో దీన స్థితి. రెండు లక్షల పైగా రుణాలు ఉన్నవాళ్లు.. పైన డబ్బులను కడితేనే మాఫీ చేస్తామని సర్కారు ప్రకటించింది. దీంతో అనేక మంది రైతులు.. మాఫీ అవుతుందనే ఆశతో ప్రైవేట్‌లో వడ్డీలకు అప్పులు తెచ్చి చెల్లించారు. రూ. రెండు, రూ. మూడు రూపాయలు మిత్తీకి తెచ్చి కట్టినోళ్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. దీంతో మాఫీ కాకపోవడంతో రోజురోజుకు వడ్డీలు భారీగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు మాఫీ చేస్తుందోనని దీనంగా ఎదురు చూస్తున్నారు.

గ్రీవెన్స్‌కు 4200 దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం వివిధ కారణాలతో వేలాది మందికి రుణ మాఫీ చేయలేదు. మొత్తం సంఖ్యలో ఇది 30 నుంచి 40 శాతం వరకు ఉంటుందని రైతు సంఘాలు అంచనా వేస్తున్నాయి. కుటుంబ సమస్య, డేటా మిస్ మ్యాచ్, ఆధార్, పేర్లు, బ్యాంకు పాస్ బుక్‌లో సమస్యలు, డీబీటీ, పీఏసీఎస్, పీపీబీ తదితర కారణాలతో రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కాని రైతుల సమస్యల కోసం ప్రభుత్వం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసింది. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచింది. దీని తోపాటు జిల్లా వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,200 దరఖాస్తులు అందాయి. వివిధ సమస్యలపై ఇంతమంది అప్లికేషన్ చేయగా, చేయని వారు ఇంకా చాలా మంది ఉన్నారు. వీటిలో అనేక సమస్యలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి పంపించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

ప్రకటనలతోనే కాలయాపన..

వాస్తవానికి ఒకే దఫాలో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల తర్వాత ప్రక్రియ ప్రారంభించింది. ఆగస్టులో మాఫీ చేస్తామని గొప్పలు కొట్టింది. కానీ ఇప్పటివరకు మూడు దఫాలుగా మాత్రమే అరకొరగా అమలు చేయగా, నాలుగో విడుత పత్తాలేదు. ముఖ్యమంత్రి, మంత్రులు ఎవరరికి తోచినట్టు వారు ప్రకటనలు చేస్తున్నారు. 'త్వరలో చేస్తాం.. ఆ పండుగకు చేస్తాం.. ఈ పండుగ తర్వాత చేస్తాం' అంటూ కాలయాపన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

దేవుడి సాక్షిగా చెప్పి మాట తప్పారు

కాంగ్రెసోళ్లు ఎన్నికలప్పుడు లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఇంట్లో ఎంత మందికి బ్యాంకులో రుణం ఉన్న 2 లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారు. 2 లక్షలకు పైన ఉన్న మిత్తి 60 వేలు కడితే రుణమాఫీ అవుతదని వ్యవసాయాధికారులు చెపితే అప్పు చేసి మరీ కట్టాను. సావుకారు వద్ద అప్పు చేసి తెచ్చిన పైసలకు మిత్తి పెరిగిపోతున్నది. తీసుకున్న అప్పు ఎప్పుడు కడుతావు అని సావుకారేమే రోజు నలుగురిలో ఇజ్జత్ తీస్తుండు. బ్యాంక్‌లో తీసుకున్న అప్పుకు మిత్తి కట్టి మూడు నెలల అవుతుంది. రుణమాఫీ అవుతుందా లేదా సమజయిత లేదు. బ్యాంకోళ్లు, వ్యసాయాధికారులను అడిగితే అంత పైనుంచి రావాల్సిందే మా చేతుల్లో ఏమి లేదని తిప్పి పంపిస్తున్నరు.

- బిల్లకుదురు రాజు, రైతు రాజాపేట

రుణమాఫీ రాక ఇక్కట్లు

నాగార్జున గ్రామీణ బ్యాంక్‌లో లక్షా98వేలు పంట రుణం తీసుకున్న. వాటిని సకాలంలో రెన్యువల్ చేసిన. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి అర్హుడిగా గుర్తించారు. నా అప్పు తీరకపోవడంతో బ్యాంక్ వారిని సంప్రదించగా వారు మీ లోన్ మొత్తం 2క్షలకు మించి ఉన్నదని చెప్పింద్రు. రెండులక్షల పైన ఉన్న 4వేల మొత్తాన్ని కట్టమని తెలుపడంతో ఆ మొత్తాన్ని చెల్లించిన. అయినా రుణమాఫీ రాలేదు. రైతు వేదిక వద్ద అధికారులను సంప్రదించగా నీ రుణమాఫీ నాలుగో విడుతలో అవుతుందని సర్దిచెబుతున్నారు. కానీ ఇంతవరకు రుణమాఫీ రాలేదు. ఆర్థికంగా ఇబ్బందులో ఉన్నాను. ప్రభుత్వం వెంటనే నాకు రుణమాఫీ అందించాలని కోరుకుంటున్నా.

- ఈదులకంటి ధర్మారెడ్డి, రైతు, మర్యాల, బొమ్మల రామారం

సీఎం రాక సందర్భంగా హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

8న యాదగిరిగుట్టకు సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్3 : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ దేవస్థానానికి ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు. ఆయన జన్మదినం సందర్భంగా స్వయంభూ పంచనారసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సీఎం హోదాలో ఆయన గుట్టకు రావడంతో ఇది రెండోసారి అవుతుంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2023 నవంబర్ 23న యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురంలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి హోదాలో ఈ ఏడాది స్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మార్చి 11న జరిగిన తొలిపూజల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గీతారెడ్డి దంపతులు హాజరయ్యారు. దేశమే గర్వపడే విధంగా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 1300 కోట్ల ప్రభుత్వ నిధులతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని మహాద్భుతంగా పూర్తి చేశారు. దాదాపుగా పనులు పూర్తికాగా కొంత మేరకు పనులు పూర్తి కావాల్సి ఉంది. ప్రధానంగా స్వామి వారి దివ్య విమాన గోపురం స్వర్ణతాపడం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో బంగారం సేకరణ చేపట్టారు. కాగా మరికొంత బంగారు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది వార్షిక బ్రహోత్సవాల లోపు స్వర్ణతాపడం పనులు పూర్తి చేస్తామని దేవస్థానం అధికారులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో యాదగిరిగుట్ట పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట అభివృద్ధిపై చర్చించే అవకాశం ఉందని పలువురు దేవస్థాన అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి దేవస్థాన అభివృద్ధిపై ఊసెత్తకుండానే వెళ్లిపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి రాక నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కొండకింద పార్కింగ్ ప్రాంతంలో గల హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఆయన పర్యటనను ప్రశాంతంగా జరిగేందుకు చేపట్టాల్సిన పనులపై అధికారులతో మాట్లాడారు.

వలిగొండ : తుమ్మలగూడెం చెరువు అలుగును పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట, నవంబర్3 : రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని ఇంద్రపాలనగరంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రవహిస్తున్న ఆసిఫ్‌నెహర్ కాల్వను, చెరువును ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు.

కత్వా పైనుంచి వెళ్లి..

వలిగొండ : మండల పరిధిలోని నెమిలకాల్వ గ్రామ పరిధిలోని ఆసిఫ్‌నెహర్ కత్వా నుంచి నాగారం మీదుగా రామన్నపేట మండలం తుమ్మలగూడెం చెరువులోకి ప్రవహించే ఆసిఫ్‌నెహర్ కాల్వను కలెక్టర్ హనుమంతరావు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ అధికారులను తుమ్మలగూడెం చెరువు అలుగు సామర్థ్యం, చెరువు తూముల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగారం వలిగొండ గ్రామాల మధ్య మూసీ నదిపై ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్లు లాల్‌బహదూర్, పి. శ్రీనివాస్‌రెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ శాంతి, మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్, ఆర్ఐలు శోభ, రాజేశ్, ఏపీఎం ప్రసాద్, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ యుగంధర్ ఉన్నారు.

అయిటిపాముల కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

పది నెలల్లో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరం : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, నవంబర్ 3 : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మండిపడ్డారు. కట్టంగూర్ మండలం అయిటిపాములలో ఆదివారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. పండించిన పంటలను కొనుగోలు చేయలేని దిక్కుమాలిన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లాలో ప్రతి సంవత్సరం దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 60 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేదని తెలిపారు. గత సంవత్సరం ఇదే సీజన్‌లో కేసీఆర్ ప్రభుత్వం 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రం కొనుగోలు చేయడం సిగ్గు చేటన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, మిల్లర్లను సమన్వయం చేయడంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఘోరంగా విఫలం చెందారని అన్నారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రణాళిక లేకుండా ఆర్భాటంగా ధాన్యం కేంద్రాలను ప్రారంభించి మళ్లీ తిరిగి చూసే పరిస్థితులు లేవన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరుగకపోవడంతో రైతులు తక్కువ ధరకు ప్రైవేట్‌లో అమ్మి నష్టపోవాల్సి వస్తున్నదని చెప్పారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం భేషరతుగా వెంటనే కొనుగోలు చేసి, బోనస్ రూ.500వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు బెల్లి మహాలక్ష్మీసుధాకర్, నలమాద వీరమ్మ సైదులు, మాజీ సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి. మల్లెబోయిన శ్రీలత కృష్ణ, నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలో బారులుదీరిన వాహనాలు

హైదరాబాద్‌కు వాహనాల బారులు

బీబీనగర్/చౌటుప్పల్, నవంబర్ 3 : దీపావళి పండుగకు గ్రామాలకు వచ్చిన హైదరాబాద్‌లో ఉండేవారు తిరుగుప్రయాణమయ్యారు. దాంతో ఆదివారం రహదారులు, బస్టాండ్లు రద్దీగా మారాయి. హైవేపై వాహనాలు బారులు దీరి వెళ్లాయి. వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై సాయంత్రం 7 గంటల సమయంలో వాహనాలు క్యూ కట్టి వెళ్లాయి. దాంతో బీబీనగర్ మండల పరిధిలోని గూడూరు టోల్ ప్లాజా వద్ద రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ ఒక్క సారిగా పరిమితికి మించి వచ్చిన వాహనాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టోల్ ప్లాజా సిబ్బంది ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు శ్రమించారు.

చౌటుప్పల్ పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. దీనికితోడు ఆదివారం మండల కేంద్రంలో సంత ఉండటంతో ఈ రద్దీ మరింత కనిపించింది.

బీబీనగర్ : గూడూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

యాదగిరిగుట్ట: మల్లాపురంలో దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

మల్లాపురంలో వైద్య కళాశాల నిర్మించాలి

- పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలి
- బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఒక్కరోజు దీక్ష

యాదగిరిగుట్ట, నవంబర్3 : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 183 కోట్లతో మల్లాపురం గ్రామానికి మంజూరైన 100 ఎంబీబీఎస్ సీట్ల ప్రభుత్వ వైద్య కళాశాల, 250 పడకల ఆసుపత్రితోపాటు గ్రామంలో పెండింగ్ పనులే లక్ష్యంగా డిసెంబర్‌లో పదివేల మందితో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమైన్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని మల్లాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన వైద్య కళాశాలతో పాటు పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరుతూ ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధతో కలిసి కర్రె వెంకటయ్య సంఘీభావం తెలిపి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ డిసెంబర్‌లో చేపట్టే అమరణ నిరాహార దీక్షకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పాల్గొంటారని అన్నారు. లక్ష్మీనరసింహ స్వామి పేరుతో మాజీ సీఎం కేసీఆర్ యాదగిరిగుట్టకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారన్నారు. వైద్య కళాశాల ఏర్పాటుకు నాడు పట్టణంలో నాలుగు ప్రదేశాలకు సంబంధించి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించగా మల్లాపురంలో సర్వే నంబర్ 64లో సుమారు 200 ఎకరాల విశాలమైన స్థలంలో అత్యాధునిక వైద్య కళాశాల నిర్మించాలని భావించిందన్నారు. ఇందుకు కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. అంతేకాకుండా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను కూడా నియమించారన్నారు. ఇదే క్రమంలో టెండర్ పిలిచేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారని, అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడంతో అది జాప్యం జరిగిందన్నారు. యాదగిరిగుట్టకు మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆయన నియోజకవర్గం కొండగల్‌కు తరలించుకుపోవాలనే కుట్ర చేస్తున్నారని అరోపించారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పట్టించకోవడం లేదన్నారు. మండలంలో వరిధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరి కోత మొదలై నెలలు గడుస్తున్నా ఒక్క గింజకు కొనుగోలు చేయలేదన్నారు. మల్లాపురం గ్రామంలో రూ. 20 లక్షలతో మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనానికి నిధులకు కేటాయించి పనులు పూర్తి చేయాలన్నారు. సాయంత్రం పండ్ల రసాన్ని అందజేసి దీక్షను విరమింపజేశారు. దీక్షలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కర్రె చంద్రశేఖర్, ఒగ్గు మల్లేశ్, దుద్దుడు శ్రీశైలం, మోట రమేశ్, పిట్టల రాజు, ఇండ్ల ప్రసాద్, గోపి వంవీ, ఓరుగంటి శ్రీధర్, చల్లూరి శ్రావణ్, దాసరి ప్రశాంత్, పుచ్చుల నర్సింహులు, గోపి పరిశి, కర్రె మల్లేశ్, గోపి విజయ్, వినయ్, ఇమామ్, బర్ల పరశురాములు, గౌడ కరుణాకర్ పాల్గొన్నారు.

నేటి తరం విద్యార్థులను యువ రచయితలుగా తయారు చేయాలి

- ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి

రామగిరి, నవంబర్ 3: నేటి తరం విద్యార్థులను యువ రచయితలుగా తయారు చేయాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా వారిని సాహిత్య అంశాలపై చైతన్యం చేసి నూతన రచనలు వెలుగులోకి తేవాలని ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. సాహిత్య రంగంలో అభ్యుదయ సాహిత్యం నుంచి ఇప్పటి వరకు వచ్చిన సాహితీ సంస్థలు, వాటి దృష్టి కోణాలు, పరిమితుల గురించి వివరించారు. ఇన్నాళ్లు అణగారిన వారి జీవితాలపై ఆధిపత్యం చేసిన మత దురహంకారం మళ్లీ పడగా విప్పి విజృంభిస్తున్నదన్నారు. ఇది సాధారణ ప్రజల జీవితాలకు ప్రమాదమని, వాటిని ప్రశ్నించే వైఖరితో రచయితలు, కవులు స్పందించాలని తెలియచేశారు. ముఖ్యంగా విద్యార్థులైన యువ రచయితలు ఈ పనికి పూనుకోవాలన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అనందాచారి మాట్లాడుతూ సమజం సమూహం నుంచి చీలి ఒంటరి తనంలోకి వెళ్లిపోవడం చాలా ప్రమాదకరమని తెలిపారు. కవులు, రచయితలు స్తబ్ధత నుంచి బయటపడి సరికొత్త సృజనకు ఉపక్రమించాలని, అందుకోసం సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఇదే సభలో స్వీయ కవితల్లో వస్తువుపై జీవకవి అనే అంశంపై మునాస్ వెంకట్, స్వీయ కథల్లో సామాజిక జీవన చిత్రాలపై ప్రముఖ కథా రచయిత భూతం ముత్యాలు, స్వీయ గీతాల్లో సామాజిక స్పృహపై ప్రముఖ గాయకుడు అంబటి వెంకన్న, కవి సమ్మేళనంలో పలువురు కవులు ప్రసంగించారు. సాయంత్రం జరిగిన ముగింపులో తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 147మంది విద్యార్థులు కవితలు రాయగా వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సోలేషన్ బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంతజు మోహనకృష్ణ, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ప్రముఖ కవులు, సాహితీవేత్తలు సాగర్ల సత్తయ్య, తండు కృష్ణకౌండిన్య, బండారు శంకర్, పెరుమాళ్ల ఆనంద్, మల్లి కార్జునచారి, యాదగిరి, నాగిరెడ్డి, అరుణ జ్యోతి, తరుణోజు భీష్మాచారి, గేర నరసింహ, బూర్గు గోపీకృష్ణ, హసేన, లయన్స్ వనం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు